క్లుప్తంగా

జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా నిజాం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా నిజాం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాధ్యతలు నిర్వహించిన హేమచంద్ర బదిలీ కావడంతో ఆయన స్థానంలో నిజాం వచ్చారు.

వైద్య శిబిరం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లిలో శనివారం సదాశివనగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇటీవల విష జ్వరాలతో రంజిత్ అనే విద్యార్థి మృతి చెందడంతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.

నాగిరెడ్డిపేట ఏవో బదిలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ఏవో విజయశేఖర్ శనివారం నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. నాగిరెడ్డిపేట మండలంలో ఏడేళ్లపాటు ఏవోగా విజయ శేఖర్ విధులు నిర్వహించారు. నిజామాబాద్ డీఏవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతోపాటు నాగిరెడ్డిపేట ఏఈవో నిఖిత రామారెడ్డి మండలం పోసానిపేట, మాల్తుమ్మెద ఏఈవో బబిత రామారెడ్డి మండలంలోని కన్నాపూర్‌కు బదిలీ అయ్యారు. వారిస్థానంలో లింగంపేట మండలం పర్మళ్ల ఏఈవో ప్రశాంత్ మాల్తుమ్మెదకు, రాజంపేట ఏఈవో శ్రీకాంత్ నాగిరెడ్డిపేటకు బదిలీపై వచ్చినట్లు ఏడీఏ వీరాస్వామి తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



రాజంపేట: పెద్దయిపల్లి గ్రామ పరిధిలో గురువారం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్ పరిశీలించారు. గాలులతో కూడిన వర్షానికి మొక్కజొన్న వేర్లు బయటకు వచ్చి పడిపోయినట్లు గుర్తించారు. రైతులు పంట పొలాల్లో మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, నీటి ప్రవాహం నుంచి కాపాడుకోవాలని రైతులకు వివరించారు. రైతులు బోయిని నర్సింలు, నవీన్ కుమార్, ప్రశాంత్ కుమార్, డీలర్ గోపాల్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పలు ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాలతో పాటు నల్లమడుగు, శెట్పల్లిసంగారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను శనివారం మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు పరిశీలించారు. మండల కేంద్రంలోని పెస్టిసైడ్ దుకాణాల్లో రైతులు కొనుగోలు చేస్తున్న పురుగులకు రసీదులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. నాణ్యమైన మందులు విక్రయించాలని సూచించారు. దుకాణాల్లో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు.

రుణమాఫీ కాని రైతులు నిరాశ చెందొద్దు

భిక్కనూరు: సాంకేతిక కారణాల వల్ల కొంత మందికి రుణమాఫీ పథకం వర్తించలేదని వారు నిరాశ చెందొద్దని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ ..లిస్టులో లేని రైతులు తమ వివరాలతో రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకుంటే వారికి రుణ మాఫీ పథకం వర్తిస్తుందన్నారు. రైతులకు కాంగ్రెస్ కార్యకర్తలు, వ్యవసాయశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



భిక్కనూరు: మండల కేంద్రంలోని అహ్మద్ బీఈడీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న హనీఫ్ పాషకు రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ పట్టాను శనివారం అందజేశారు. 'ఎనలైటికల్ స్టడీ ఆన్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఫిష్ బయోడైవర్సిటీ అండ్ హబిటేట్ ఎకలజీ' అనే అంశంపై డాక్టర్ దీపక వాట్స్ పర్యవేక్షణలో పరిశోధనలు నిర్వహించి యూనివర్సిటీకి సమర్పించారు. దీంతో అధికారులు హనీఫ్ పాషకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. పలువురు అభినందించారు.



బాన్సువాడలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగిన పీజీ వైద్యురాలి హత్యాచారం ఘటనకు నిరసనగా శనివారం జిల్లాలోని వైద్యులు విధులు బహిష్కరించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. 24 గంటల పాటు అన్ని ఆస్పత్రులలో ఓపీ వైద్య సేవలు నిలిపివేస్తూ వైద్యులు పిలుపునిచ్చిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులపై ఇలాంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. ఘటనకు కారకులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు సంఘీభావంగా బాన్సువాడలో బీజేపీ నేతలు ఆందోళన చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మద్నూర్ సీహెచ్‌సీ వద్ద ..



బాన్సువాడలో ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలు



ఎల్లారెడ్డిలో ..



బిచ్కుందలో ..



రాజంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఆధ్వర్యంలో..

కృష్ణాష్టమిని పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు

బాన్సువాడ రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఇస్కాన్, బాన్సువాడ సత్సంగ్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కామారెడ్డి జిల్లా ప్రతినిధి వెంకట ప్రభుదాస్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. బుధవారం బాన్సువాడలోని సరస్వతి శిశుమందిరంలో ప్రత్యేక కార్యక్రమం, బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా రావాల్సిందిగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు మల్లికార్జున్, లక్ష్మణ్‌గుప్తా, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ప్రతినిధులు

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు



జుక్కల్‌దానితండా పాఠశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు



మహమ్మద్ నగర్ ఉన్నత పాఠశాలలో..

అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండగను జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తుగా జరుపుకున్నారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిలు తినిపించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఒకరినొకరు రాఖీలు కడుతూ సోదర, సోదరీ భావాన్ని చాటుకున్నారు. నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనమిద్దరం దేశానికి ధర్మానికి రక్ష అంటూ నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పిట్లం శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో..



శారద శిశుమందిర్ పాఠశాలలో ..



లచ్చాపేట ఉన్నత పాఠశాలలో..



మాచారెడ్డి: చెట్లకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



నిజాంసాగర్: రాఖీలు కట్టుకుంటున్న టీచర్లు

బెల్టుషాపులు ఎత్తివేయాలని వినతి



నిజాంసాగర్(జుక్కల్): గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు కొనసాగిస్తున్న బెల్టుషాపులను ఎత్తివేయాలని కోరుతూ శనివారం జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో స్థానిక యువకులు వినతిపత్రం అందజేశారు. బెల్టు షాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయించడం వల్ల మద్యం ప్రియుల జేబులు ఖాళీ అవుతున్నాయన్నారు. బెల్టు షాపులను పూర్తిగా నిషేధిస్తూ నిర్వాహకులపైన కేసులు నమోదు చేయాలని పోలీసులను వారు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



బాన్సువాడ రూరల్: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని బాన్సువాడ సీఐ కృష్ణ సూచించారు. శనివారం లోకల్ ఆటో వర్కర్లు సీఐ కృష్ణను మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ సమస్యలను తెలియజేశారు. త్వరలోనే బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆటో అడ్డా కోసం స్థలం చూపిస్తామన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు పత్రాలు కలిగి ఉండాలన్నారు. వారివెంట సీఐటీయూ నాయకులు ఖలీల్ ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య మిత్రలు శనివారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ నెల 20 నుంచి సమ్మె నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఆరోగ్యమిత్రలు సందీప్‌రెడ్డి, సాయిబాబా తదితరులున్నారు .

మెడిటేషన్‌తో మానసిక ప్రశాంతత

కామారెడ్డి టౌన్: మెడిటేషన్‌తో మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో అధికారులకు, సిబ్బందికి మానసిక ప్రశాంతతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందు ప్రియ మాట్లాడుతూ.. ఓంశాంతి ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, వైద్యుడు వెంకటరమణ, ఓం శాంతి ఇన్‌చార్జి అనిల్‌కుమార్, సంతోషి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



గోపాల్‌పేటలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట పోలీసులు సూచించారు. గోపాల్‌పేటలో శనివారం వారు కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించి మాట్లాడారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. గ్రామాలలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో..

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరెపల్లి స్టేజీ వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సైబర్ నేరాలపై షీటీం సభ్యుడు భూమయ్య అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, డ్రగ్స్, మత్తు పదార్థాల గురించి వివరించారు. అలాగే రోడ్డు భద్రతపై విశదీకరించారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. షీటీంల అవసరం పడినప్పుడు 8712686094 టోల్‌ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930కు కాల్ చేయాలన్నారు. షీ టీం సభ్యులు సౌజన్య, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి మైసకళ, కళాబృందం సాయిలు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కామారెడ్డి అర్బన్: తెలంగాణను మత్తు రహిత రాష్ట్రంగా మార్చడంలో విద్యార్థులు ముందుండాలని టీఎస్‌నాబ్ డీఎస్పీ సోమనాథం అన్నారు. కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం టీఎస్‌నాబ్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యపరంగా, సమాజంలో కలిగే చెడు ప్రభావాలపై సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ సంబంధించిన వివరాలను డయల్ 100, 14446లను తెలపవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

43వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: సదాశివనగర్ మండలం ధర్మారావుపేటకు చెందిన సంతోష్‌రెడ్డి, హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో డెంగీతో చికిత్స పొందుతున్న సతీష్‌కు అవసరమైన ఓ పాజిటివ్ ప్లేట్‌లెట్స్‌ను అందజేసి ప్రాణదాతగా నిలిచినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. సంతోష్‌రెడ్డి రక్తదానం చేయడం ఇది 43వ సారి.

ఆధ్యాత్మికం

కిటకిటలాడిన చుక్కాపూర్ ఆలయం



మాచారెడ్డి: శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా గండ దీపాలు, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భజ, అర్చకులు ఉన్నారు.

వర్షాల కోసం జలాభిషేకాలు

నిజాంసాగర్(జుక్కల్): వర్షాలు సంవృద్ధిగా కురవాలని కోరుతూ శనివారం బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయం వద్ద భక్తులు జలాభిషేకం, ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. నాయకులు బాలయ్య, గంగారెడ్డి, వీరశెట్టి, రమేష్ గౌడ్, తదితరులున్నారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శనివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంగారాం, వెంకట్‌రెడ్డి, అంజల్‌రెడ్డి, సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సు నడిపించాలి



వినతి పత్రం అందజేస్తున్న మల్కాపూర్ గ్రామస్తులు

బీబీపేట: మల్కాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సును సమయానికి నడిపించాలని కోరుతూ గ్రామానికి చెందిన విద్యార్థులు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. గతంలో ఉదయం 7 గంటలకు, 10 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు బస్సును నడిపించేవారని ప్రస్తుతం అలా రావడం లేదని వాపోయారు. దీంతో కళాశాల విద్యార్థులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గతంలో మాదిరిగానే బస్సును గ్రామానికి నడిపించాలని వారు విన్నవించారు. గ్రామస్తులు కందునూరి స్వామిగౌడ్, నరేందర్, రమేష్, సన్నిధి తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. శనివారం ఆమె వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. జీపీఎన్ రోడ్, హౌజింగ్ బోర్డు కాలనీ, బతుకమ్మ కుంట ప్రాంతాలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షం వల్ల కాలనీవాసులు పడ్డ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని, వర్షపు నీరు ఇళ్లలోకి, దుకాణాల్లోకి రాకుండా, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



దోమకొండలో మూసి ఉన్న వ్యాపార సముదాయాలు



భిక్కనూరులో ..

బంద్ విజయవంతం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ సంఘాలు ఇచ్చిన బంద్ విజయవంతమైంది. దోమకొండ, భిక్కనూరు, తాడ్వాయి, రామారెడ్డిలలో వ్యాపార వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. హిందువుల మారణకాండను ఖండిస్తూ హిందూ సంఘాల సభ్యులు, బీజేపీ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని దోమకొండ హిందూ సంరక్షణ సమితి శాఖ సభ్యులు తీర్మానం చేశారు. బంగ్లాదేశ్‌లో మృతిచెందిన హిందువుల ఆత్మశాంతికి భిక్కనూరులో రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు – సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయి మండల కేంద్రంలో..



భిక్కనూరులో నివాళులర్పిస్తున్న హిందూ సంఘాల నేతలు



రామారెడ్డి ఎస్సై నరేష్‌కు వినతి పత్రం ఇస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు



రామారెడ్డిలో ర్యాలీ

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ శివప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. స్కాలర్‌షిప్‌ల పేరిట పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో చేరడం వల్ల కళాశాల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. నాయకులు రణధీర్, సంపత్, జస్వంత్ తదితరులున్నారు.

విద్యార్థికి అభినందనలు



రాజంపేట: తలమడ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న అభిరామ్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న సందర్భంగా శనివారం హెచ్ఎం భిక్షపతి, ఉపాధ్యాయులు అభినందించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ స్కిల్ – ఇంటింటా ఇన్నోవేటర్ అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో అభిరామ్ పాల్గొని జిప్‌తో కూడిన టార్పాలిన్‌ను తయారు చేశారు. సాధారణంగా గ్రామాల్లో ధాన్యం బయట ఆరబెడతారు. కానీ వర్షం వచ్చినపుడు టార్పాలిన్ ఒక వైపు కప్పినా కూడా కింద నుంచి గాని ప్రక్కల నుంచి గాని నీరు వచ్చి ధాన్యం తడుస్తుంది. ఆరడం చాలా కష్టంగా ఉంటుంది. ఈ సమస్య నుంచి బయటపడటానికి 'మూడు వైపులా జిప్‌తో కూడిన టార్పాలిన్‌ను తయారు చేసాడు. విద్యార్థి ప్రతిభను గుర్తించి ఉపాధ్యాయులు అభినందించారు.

'లైఫ్ స్కిల్స్'పై విద్యార్థులకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య

కామారెడ్డి అర్బన్: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు మార్పును స్వీకరించాలని, తాము నేర్చుకున్న అంశాలను ఇతరులకు అందించాలని, సమాజ సేవలో ముందుండాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య అన్నారు. కళాశాల టీఎస్‌కేసీ, ఆంగ్ల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'లైఫ్ స్కిల్స్'పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. వక్తగా హాజరైన డిజిటల్ ఈక్విటీ సంస్థ వ్యవస్థాపకులు ఓంకార్, దివ్యలు మాట్లాడుతూ.. విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దడానికి తాను కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. టీఎస్‌కేసీ సమన్వయకర్త ఫర్హీన్‌ఫాతిమా, మెంటర్ అజహరొద్దీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.